మండల కేంద్రం ముస్తాబు



నవతెలంగాణ-మద్నూర్

నేడు అయోధ్యలో నిర్వహించే బాల రాముని విగ్రహా ప్రాణ ప్రతిష్ట నేపథ్యలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించ డానికి మద్నూర్ మండల కేంద్రం ముస్తాబు అయింది. గ్రామ గ్రామాన వాడ వాడలు కాషాయ తోరణాలతో ఊర్లన్నీ లైటింగ్‌లతో అందంగా రూపుదిద్దుకున్నాయి. ముఖ్యంగా మద్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన కమాన్ వ్యవస్థ లైటింగ్ వ్యవస్థ కాషాయ తోరణాలు ఏర్పాటుతో పాటు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలో ప్రతి ఇంటి ముఖ ద్వారానికి యువకులంతా జైశ్రీరామ్ నినాదాల రంగులు వేశారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-పిట్లం

మండలంలోని చిన్న కొడప్‌గల్ గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మి నివాసపు మిద్దిల్లు ప్రమాదవశాత్తు విద్యుత్తు ప్రమాదంతో పది రోజుల క్రితం కాలి బూడిదకావడంతో సర్వస్వం కోల్పోయారు. రోడ్డున పడ్డట్టయింది. దీంతో స్పందించిన బురణపూర్ గ్రామానికి చెందిన ఒర్రె రాజు రూ.10 వేల ఆర్థిక సాయం బాధిత కుటుంబీకులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, మాజీ డీసీసీబి డైరెక్టర్ చింతల సాయిరెడ్డి , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



షబ్బీర్ అలీని సన్మానిస్తున్న దృశ్యం

ప్రభుత్వ సలహాదారుగా షబ్బీర్ అలీ

- సన్మానించిన పలువురు

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా మాజీ మంత్రి షబ్బీర్‌అలీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మహమ్మద్ షబ్బీర్ అలీని ఆదివారం జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా నా రెడ్డి మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వంలో అనేక మంత్రి పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేసిన అనుభవంతో, ప్రభుత్వానికి మంచి సూచనలు ఇచ్చి ప్రజల సేవలో కొనసాగాలని ఆశిస్తున్నామని అన్నారు. బడుగు బలహీన, మైనార్టీ, పేద ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించిన సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పొడగింపు

నవతెలంగాణ-భిక్కనూర్

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈనెల 23వ తేదీ వరకు పొడిగించినట్టు సిద్ద రామేశ్వర నగర్ గ్రామ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న బంజారా సేవా సంఘం నాయకులు

సేవాలాల్ జయంతిరోజు
ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి

- బంజారా సేవా సంఘం నాయకులు డిమాండ్

నవతెలంగాణ-లింగంపేట్

సేవాలాల్ జయంతి నాడు ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని బంజారా సేవా సంఘం మండల ప్రధాన కార్యదర్శి విట్టల్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గిరిజనుల ఆరాధ దైవమైన సేవాలాల్ జయంతి ఫిబ్రవరి నెలలో జయంతి ఉత్సవాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. పలుసార్లు గిరిజనులు సెలవుదినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని విన్నపించిన ఇప్పటివరకు సెలవు దినంగా ప్రకటించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సేవాలాల్ జయంతి రోజు సెలవు దినంగా ప్రకటించి గిరిజనుల ఆత్మగౌరాన్ని కాపాడాలన్నారు. రాష్ట్ర జనాభాలో గిరిజనులు అధికంగా ఉన్నారని ఆయన అన్నారు.

ఆరేండ్లకు ఎస్ఎంసీ ఎన్నికలకు మోక్షం

విద్యావ్యవస్థ, బోధన గాడిన పడేనా..?

నవతెలంగాణ-ఆర్మూర్

పాఠశాలల్లో ఎస్ఎంసి (స్కూలు మేనేజ్మెంట్ కమిటీ) నూతన పాలకవర్గం ఎన్నికలకు ఆరేండ్ల తర్వాత మోక్షం లభించింది. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో నోటిఫికేషన్‌లు జారీ చేశారు. 9, 10వ తరగతి చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు కమిటీలో ఉండే అవకాశం ఉండదని ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు కాగా, ఈనెల 23న అభ్యంతరాల స్వీకరణ, 24న తుది జాబితా, 29న ఎన్నికల నిర్వహణ ఉంటుంది. వీరి పదవి కాలం రెండు సంవత్సరాలు కొనసాగనుంది. ఎస్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో విద్యావ్యవస్థ గాడిలో పడేనా..? అని చర్చలు వినిపిస్తున్నాయి.



ఉత్తుత్తి యాజమాన్య కమిటీలేనా?

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్న సదుద్దేశంతో గతంలో ప్రభుత్వాలు ఎస్ఎంసిలను ఏర్పాటు చేసింది. రాజీవ్ విద్యా మిషన్ ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలకు ఒక్కో కమిటీని ఏర్పాటు చేసి సర్వాధికారాలు కల్పించినా అవి నామమాత్రం అయ్యాయి. పాఠశాల నిధులు, విద్యార్థుల అవసరాలు, ఉపాధ్యాయుల పనితీరుతో పాటు ప్రతి నెల సమీక్షలు నిర్వహించాల్సిన ఎస్ఎంసిలు పూర్తిగా నిర్వీర్యమై పోతున్నాయని ఆరోపణలు వ్యక్తమయ్యాయి. గతంలో జిల్లా వ్యాప్తంగా ప్రతి పాఠశాలకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 2,317 యాజమాన్య కమిటీలు ఉన్నవి. గత విద్యా 2012-13 సంవత్సరంలో ఈ కమిటీలకు గ్రామ సర్పంచ్ చైర్మన్‌గా వ్యహరించారు. 2013-14 విద్యా సంవత్సరంలో రాజీవ్ విద్యా మిషన్ పూర్తి మార్పులు చేసింది. చైర్మన్ బాధ్యతలను పాఠశాలల్లో చదివే పిల్లల తల్లిదండ్రులైన ఒకరికి కట్టబెట్టింది. ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వారీగా చైర్మన్‌ను ఎన్నుకుంటారు. కన్వీనర్‌గా సంబంధిత పాఠశాల ప్రాథమిక ఉపాధ్యాయుడు వ్యవహరిస్తే, కో కన్వీనర్‌గా ఒక సీనియర్ ఉపాధ్యాయుడు వ్యవహరిస్తారు. ఎక్స్ అఫీషియల్ సభ్యులుగా స్థానిక అంగన్వాడికి, వార్డు సభ్యుడు, పొదుపు సంఘం అధ్యక్షులు, ఏఎన్‌ఎంలను కమిటీలోకి తీసుకుంటారు. కాగా గత కొన్ని సంవత్సరాల క్రితం అన్ని ప్రభుత్వ పాఠశాలలో కమిటీలను ఎన్నుకోగా ఏ ఒక్క పాఠశాలలో కూడా వీటి ప్రభావం కనిపించలేదు. ప్రత్యేకంగా లక్షల రూపాయల నిధులు వెచ్చించి ఆర్‌ఓఎం ద్వారా వీరి కోసం శిక్షణ కార్యక్రమాలు అందించిన చైతన్యవంతులు కాకపోవడం విచిత్రం.

అధికారాలేన్నో...
విద్యా బోధనను గడిలో పెట్టాలి

పాఠశాల యాజమాన్య కమిటీలకు ఉన్న అధికారాలను పరిశీలిస్తే.. పాఠశాల పనితీరుపై అజమాయిషి చేయడం, అభివృద్ధి ప్రణాళిక తయారు చేయడం, ప్రభుత్వ నిధుల వినియోగంపై సమీక్షించటం కమిటీ ప్రధాన విధులు. వీటితో పాటు పాఠశాలల్లో పిల్లల హాజరు నమోదు, బడిబయట పిల్లల కోసం చేపడుతున్న కార్యక్రమాలపై పరిశీలన చేయాల్సి ఉంటుంది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, తాగునీరు, మూత్రశాలల వసతి పిల్లలకు తగ్గట్లుగా ఉన్నాయా? లేదా? అని పరిశీలించటం విధుల్లో ప్రధానమైనది. కేవలం పాఠశాలలు పిల్లలే కాకుండా ఉపాధ్యాయుల పనితీరును కూడా పరిశీలించవచ్చు. సక్రమంగా ఉపాధ్యాయులు హాజరవుతున్నారా పిల్లలకు సరిపడా ఉపాధ్యాయులు ఉన్నారా.. లేదా అన్నది కూడా ఎస్ఎంసి కమిటీ చూసుకోవాల్సి ఉంటుంది. వీటన్నిటిపై రోజువారిగా పరిశీలిస్తూ నెలవారి సమీక్ష సమావేశం కావాలి. అనంతరం సమస్యలపై తీర్మానం చేయడంతో పాటు పాఠశాలకు అవసరమైన నిధుల మంజూరు కోరుతూ కమిటీ ద్వారా తీర్మానం చేసే అధికారం ఉంది. మరికొద్ది రోజులలో ఎస్ఎంసి ఎన్నికలు జరుగుతున్న వేల రాబోయే ఎస్ఎంసి చైర్ పర్సన్.. వైస్ చైర్ పర్సన్‌లతో పాటు కమిటీ సభ్యులు విద్య బోధనను గడిలో పడేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

26న ట్రాక్టర్, బైక్, ఆటో ర్యాలీ

- 16న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలి
- ప్రజా, కార్మిక, రైతు సమస్యలు పక్కదోవ పట్టించేందుకు మతం ముందుకు తెస్తున్న మోడీ
- తిప్పి కొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రమ పిలుపు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రమ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజా, కార్మిక, రైతు సమస్యలు పక్కదోవ పట్టించేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మతం ముందుకు తీసుకొస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమ అన్నారు. కేంద్రం అవలంభిస్తున్న విధానాలను తిప్పికొట్టేందుకు జాతీయ స్థాయిలో ప్రజాసంఘాల కమిటీ పిలుపు నేపథ్యంలో నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 26వ తేదీనా ట్రాక్టర్, ఆటో, బైక్ ర్యాలీ చేపట్టనున్నామని, ఫిబ్రవరి 16వ తేదీనా దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నామని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ సిఐటియు జిల్లా కార్యాలయంలో సిఐటియు జిల్లా విస్తృత సమావేశం సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్‌గౌడ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఎస్ వి రమ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ , మతోన్మాద , నయా ఉదారవాద విధానాల వలన ప్రజల నుండి వచ్చే కార్మిక వర్గం రైతాంగం పేద ప్రజల నుండి వచ్చే వ్యతిరేకతను గుర్తించి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ మత రాజకీయాలకు తెరలేపుతూ అయోధ్య రామ మందిరాన్ని ముందుకు తీసుకువచ్చిందన్నారు. ఇంకా పూర్తిగా నిర్మాణం కానీ అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ట చేయడం సరికాదని పెద్ద పెద్ద పీఠాధిపతులు సూచించినా కూడా పట్టించుకోకుండా పార్లమెంటు ఎన్నికల ముందే కార్యక్రమాన్ని తీసుకుందని అక్షింతల పేరుతో ప్రతి ఇంటికి వెళుతూ ప్రజల ఎదుర్కొంటున్న ఇబ్బందులు , సమస్యలను పక్కదారి పట్టించే విధంగా ప్రజల్ని మతం మత్తులో ముంచుతుందన్నారు. ఈ బీజేపీ చేస్తున్న మత రాజకీయాలను తిప్పి కొట్టడంలో భాగంగా దేశంలోని కార్మిక వర్గం , రైతాంగం , ప్రజలందరినీ చైతన్యం చేయడం కోసం దేశంలోని అన్ని జాతీయ కార్మిక సంఘాలు, (రైతు సంఘాల ఐక్యవేదిక) సంయుక్త కిసాన్ మోర్చా, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత కిసాన్ సభలు సంయుక్తంగా ఫిబ్రవరి 16 న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్ , పారిశ్రామిక బంద్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఫిబ్రవరి 16 న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లాలో జరిగే పారిశ్రామిక , గ్రామీణ బంద్ విజయవంతనికి సిఐటియు అన్ని రంగాల , యూనియన్ల సమావేశాలు నిర్వహించి జిల్లావ్యాప్తంగా సమ్మె ప్రచార క్యాంపెయిన్ చేపట్టి బిజెపి ప్రభుత్వ మత రాజకీయాలను తిప్పి కొట్టాలని జిల్లాలో సమ్మెను విజయవంతం కోసం జిల్లా కమిటీ సభ్యులు అన్ని రంగాల యూనియన్ల బాధ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, ఉపాధ్యక్షులు ఈవీఎల్ నారాయణ, రేణుక, సుకన్య కృష్ణ, కటారి, రాములు, నరసయ్య, లక్ష్మీ, మౌనిక, కొండ గంగాధరు, చామంతి, లక్ష్మి, మోహన్, సాగర్, రాజేష్, ఫసియొద్దీన్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ఓటర్లతో..
సమగ్ర ఓటరు జాబితా

- తప్పులు లేకుండా సిద్ధం చేయాలి
- సిబ్బందికి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచన



తాడ్వాయి: రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-తాడ్వాయి

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో బి ఎల్ ఓ లు ఓటరు జాబితాను జాగ్రత్తగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి జితేశ్ వి పాటిల్ సూచించారు. సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనకు అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని అన్నారు. ఆదివారం తాడ్వాయి మండల కేంద్రంలో, ఎర్రపహడ్ గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత, అలాగే వికలాంగులు, థర్డ్ జెండర్ల నమోదుకు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రముఖులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల ఓటర్ల పేర్లు గల్లంతు కాకుండా జాబితాలను పరిశీలించుకో వాలన్నారు. ఓటరు జాబితాను ఆయా పోలింగ్ కేంద్రాలలో ప్రదర్శించాలని సూచించారు.

ఓటరు జాబితాలో చనిపోయిన ఓటర్లు, 100కు పైగా వయసున్న ఓటర్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లు, చిరునామా మారిన ఓటర్లపై ఎక్కువదృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ సూచించారు. చనిపోయిన , వలస వెళ్లిన ఓటర్లు, ఇతర ఓటర్ల విషయంలో పూర్తి జాగ్రత్తగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు.

ఓటర్ నమోదును పరిశీలించిన ఆర్డీవో

భిక్కనూర్: భిక్కనూరు మండలంలో జనవరి 1వ తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన యువతి యువకుల నుండి ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శని, ఆదివారాల్లో నూతన ఓటరు నమోదు, తప్పుల సవరణ దరఖాస్తులను స్వీకరించినట్టు తెలిపారు. వీటిని త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, బి ఎల్ వో లు వచ్చిన దరఖాస్తులను బూత్ వైజ్ గా రికార్డు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శివప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, బి ఎల్ వో లు ఉన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

నాగిరెడ్డిపేట్: మండల వ్యాప్తంగా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ అన్నారు. ఆదివారం నాగిరెడ్డిపేట మండలంలోని జప్తిజానకంపల్లి. ధర్మారెడ్డి తండా గ్రామ పంచాయతీల పరిధిలో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగిరెడ్డిపేట మండలంలో 32 పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్టు తెలిపారు. అర్హులు ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసిల్దార్ లక్ష్మణ్ సిబ్బంది ఉన్నారు.



భిక్కనూర్: రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి



నాగిరెడ్డిపేట్‌లో...

విజేతలకు మెమోంటోలు అందజేత

- మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు గడ్డం జనార్దన్ రెడ్డిద్వారా

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం గడ్డం జనార్దన్ రెడ్డి జ్ఞాపకార్థం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని జూనియర్ బాలబాలికలకు నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. బాల్ బ్యాడ్మింటన్ బాలికల విభాగంలో రెంజల్ బాలికలు ప్రథమ స్థానం గెలుపొందగా వారికి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రజనీకిషోర్, స్థానిక సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, ప్రధానోపాధ్యాయులు కట్ట ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, ట్రస్టు నిర్వాహకులు వెంకటరెడ్డి, రామ్ రెడ్డి, అశోక్‌రెడ్డి, స్రవంతి, సాత్విక్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతకు మెమోంటోను అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

పిరమిడ్ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సిద్దులగుట్టలో నిర్మిస్తున్న తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద రెండవ పిరమిడ్ శ్రీ నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం నిర్మాణంకోసం నందిపేట మండలానికి చెందిన ఉపాధ్యాయులు గీత నాగభూషణం 50వేల రూపాయల విరాళాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పి ఎస్ ఎస్ ఎం జిల్లా అధ్యక్షులు సాయి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రవి దేశ్ముఖ్‌కు సన్మానం



నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు కిరణ్ దేశ్ముఖ్ స్వగృహంలో అమెరికాలో స్థిరపడ్డ ప్రముఖ వ్యాపారవేత్త రవి దేశ్ముఖ్‌ని మర్యాద పూర్వకంగా ఆదివారం కలిసి శాలువా బొకేతో ఘనంగా సత్కరించారు. రవి దేశ్ముఖ్ మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో నిర్మించ తలపెట్టిన బ్రాహ్మణ భవనానికి ఆర్థికంగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. అమెరికాలో స్థిరపడ్డ బ్రాహ్మణ ఎన్నారైలతోనూ బ్రాహ్మణ భవన నిర్మాణానికి ఆర్థికంగా సహకరించేటట్టు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు కిరణ్ దేశ్ముఖ్ బ్రాహ్మణ సంఘం సభ్యులు లక్ష్మీనారాయణ భరద్వాజ్, రమేష్ కులకర్ణి, ఎలమంచిలి వేణుగోపాల్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన ఏలేటి రాజు కుమార్తె సారీ ఫంక్షన్ వేడుకల కార్యక్రమంలో ఆదివారం ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు. తన కుమారుడు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బాల్కొండ బిజెపి నాయకులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డితో కలిసి ఏలేటి రాజు కుమార్తెను ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్థానిక బిజెపి పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మహిళా సమాఖ్య అధ్యక్షులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్‌లోని ఏడు మండలాల మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి శాలువాతో సన్మానించి పూల బొకే అందజేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నిజాంబాద్ రూరల్ ఏడు మండలాల మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు పాల్గొన్నారు.

రాజకీయ భేదాలు లేకుండా అభివృద్ధి చేసుకోవాలి

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్/మాక్లూర్

ఆలూరు మండలంలోని రాంచంద్రపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం స్కూల్‌లో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమే అని, పచ్చని పల్లెలో రాజకీయ బేధాలు లేకుండా అందరూ కలిసి అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యేగా అవినీతి చేయను అని చేసే వాళ్ళను కూడా వదలను అని, పార్టీలు వేరు మానవ సంబంధాలు వేరు అని అన్నారు. ప్రతి గ్రామంలో విద్య, వైద్య,ఉపాధికి మొదటి ప్రాధాన్యం అని అన్నారు. కార్యక్రమలో ఎంపీటీసీ ప్రభాకర్,సర్పంచ్ వెంకన్న,మహేష్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే క్రమశిక్షణ అలవడుతుంది

- జిల్లాస్థాయి క్రీడా పోటీల ప్రారంభించిన ఎంపీపీ



క్రీడాకారులతో ఎంపీపీ,సర్పంచ్, ఎస్ఐ, తదితరులు

నవతెలంగాణ-రెంజల్

విద్యార్థుల్లో చదువుతోపాటు క్రీడల్లో రాణించి నట్లయితే మాన సిక ఉల్లాసం క్రమ శిక్షణ అల వడు తుందని ఎంపీపీ రజిని కిషోర్ స్పష్టం చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గడ్డం జనార్ధన్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉమ్మడి జిల్లా సాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే మానసిక ఉల్లాసంతో క్రీడా పోటీలలో రాణించగలుగుతారని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని మండలాల నుండి విచ్చేసిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, స్వాగతం పలికారు. బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, రంగోలి పోటీలను నిర్వహించగా విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, ప్రధానోపాధ్యాయులు కట్ట ఆంజనేయులు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు పి. మోహన్ రెడ్డి, మండల అధ్యక్షులు టి .సోమలింగం గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షులు శంకర్, ఎస్సై ఉదయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరమంతా అపార్ట్మెంట్‌లే



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరం అభివృద్ధి చెందుతున్న తరుణంలో నగరంలోని ప్రతి ప్రాంతంలోనూ నివాసయోగ్యాల కోసం ప్రతి ప్రాంతంలో వ్యక్తిగత(ఇండిపెండెంట్ హౌస్) భవంతులను నిర్మించడం కోసం స్థలాలు సరిపోవడం లేదని భవన నిర్మాణాల యజమానులు ఉన్న స్థలంలోని ఎక్కువ భవంతులు నిర్మించాలని ఆలోచనతో నిజామాబాద్ నగరమంత అపార్ట్మెంట్లు వెలుస్తున్నాయి. రానున్న రోజుల్లో ఇండిపెండెంట్ హౌసెస్, డూప్లెక్స్ హౌసస్ సర్వీస్ కంటే అపార్ట్మెంట్లే ఎక్కువ నిర్మాణం జరిగే విధంగా ఉందని అంటున్నారు. అపార్ట్మెంట్లు రక్షణ కలిగి ఉంటాయని భావిస్తున్నారు. నగరమంతా బహుళ అంతస్తులు అపార్ట్మెంట్లో నిర్మించేందుకు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. నిజామాబాద్ నగరంలోని వినాయకనగర్, సుభాష్ నగర్, రాజరాజెంద్ర చౌరస్తా, కంఠేశ్వర్, కంఠేశ్వర్ బైపాస్‌లో అపార్ట్‌మెంట్ నిర్మాణాలు ఉన్నాయి.

ఛలో ఢిల్లీకి తరలిరావాలి

నవతెలంగాణ-బాల్కొండ



మాట్లాడుతున్న బీసీ సంఘం సభ్యులు

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు అబ్బగోని అశోక్ గౌడ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 7 నుండి 9 వరకు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో బీసీ కులగణన కోసం ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. భారతదేశంలో బీసీ కులాలకు ఇంతవరకు బిసి జనగణన జరపలేదని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారిన కుల గణన జరిపించకపోవడం సిగ్గుచేటని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బీసీలు అందరూ ఢిల్లీలో జరగబోయే జంతర్ మంతర్ వద్ద బీసీ కులగణన కోసం చేస్తున్న ధర్నా కార్యక్రమానికి రావాలని పిలుపునిచ్చారు.



బోధన్: లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్మికులు,



సిరికొండలో...



నిజామాబాద్‌సిటీలో....



నిజామాబాద్‌సిటీలో...

కార్మికవర్గ రాజ్యస్థాపన కోసం కృషి చేయాలి

- తొలి కార్మిక కర్షక సోషలిస్టు నిర్మాత లెనిన్
- వర్గ పోరాటమే లెనిన్‌కు నివాళి
- శతవర్థంతి కార్యక్రమంలో నాయకులు

నవతెలంగాణ-విలేకరులు

బోధన్: ప్రపంచంలో తొలి కార్మిక, కర్షక, సోషలిస్టు నిర్మాత కామ్రేడ్ లెనిన్ అని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. ఆదివారం బోధన పట్టణంలోని తట్టికోట కాలనీలో కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతిని ఘనంగా నిర్వహించి ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల మధ్య వర్గపోరులేని ప్రపంచంలో మొట్ట మొదటిసారి కార్మికవర్గ సోషలిస్టు సమాజ నిర్మాణం చేసిన మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ అని అన్నారు. మానవజాతి వందల, వేల ఏళ్లుగా కలలు గంటున్న ఒక మనిషి మరొక మనిషిని, ఒక జాతి మరొక జాతీని పీడించలేనటువంటి కార్మిక వర్గ సోషలిస్టు సమాజాన్ని ప్రపంచంలోనే మొట్టమొదటిసారి స్థాపించిన వ్యక్తి కామ్రేడ్ లెనిన్ అని కొనియాడారు. ఆయన 54 సంవత్సరాలు నిండకుండానే మరణించారని, అందులో 35 ఏళ్లకు మించిన ప్రజా జీవితంలో చేసిన పనులు సాధించిన విజయాలు ప్రపంచానికి చూపిన ఆదర్శాలు ఆయనను అనితర సాధ్యమైన మరణాంతర జీవితాన్నిచ్చా యన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు బి. నాగమణి, జి. సీతారాం, బి.సాయిలు, ప్రభాస్,శంకర్, సాయిలు, రాజు,లక్ష్మణ్, అరుణ, సాయవ్వ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: మానవాళి విముక్తి ప్రదాత లెనిన్ శతవర్ధంతి సభ సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఐఎఫ్టియు కార్యాలయంలో నిర్వహించారు లెనిన్ ఫొటోకు పూలమాలవేసి నివాళి అర్పించారు. న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు మాట్లాడుతూ మార్క్సిజం, లెనినిజం అజేయం అని ఆయన అన్నారు. లెనిన్ మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథాన్ని శాస్త్రీయంగా అవగాహన ఏర్పరచుకొని రష్యాలో విప్లవం తీసుకురావడానికి కృషి చేశాడని ఆయన తెలిపారు. మార్క్సిజంలోని విప్లవకర అత్యంత శాస్త్రీయ వర్షాలను కలిపి ఉంచడం ద్వారానే విప్లవ లక్ష్యమైన మానవాళి విమోచన సాధ్యమవుతుందని వివరించారని ఆయన తెలిపారు. "విప్లవం అంటే విందు భోజనం కాదని కత్తుల వంతెనపై ప్రయాణం లాంటిదని " ఆయన అన్నారు. సామ్రాజ్యవాదం గూర్చి లెనిన్ రూపొందించిన సిద్ధాంతం ఒక మహత్తర సైదాంతిక విజయమని, అది ఒక సత్యమని ప్రపంచంలో రుజువు చేయబడిందని ఆయన తెలిపారు. నేడు భారతదేశంలో మతోన్మాద బిజెపి పరిపాలన చేస్తోందని, లౌకిక ప్రజాస్వామ్య విలువలను పాతరేస్తోందని ఆయన అన్నారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే ప్రక్రియ ఆలోచనతో పనిచేస్తుందని తెలిపారు. దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి, మతం, దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తుందని ఆయన అన్నారు. ప్రజలకు నరేంద్ర మోడీ ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను గత పది సంవత్సరాల పాలనలో అమలు చేయకుండా మోసం చేసిందని ఆయన అన్నారు. లెనిన్ జీవిత స్ఫూర్తితో భారతదేశ విప్లవానికి కృషి చేయవలసిన బాధ్యత విప్లవ సంస్థలపై ఉందని ఆయన అన్నారు. మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజల్ని ఐక్యం చేసి న్యూ డెమోక్రసీ ఉద్యమిస్తోందని దాసు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి బి సూర్య శివాజీ, అధ్యక్షతన జరిపారు. ప్రపంచ శ్రామిక వర్గానికి మార్క్సిజమే దిక్సూచి అని శివాజీ అన్నారు. ప్రజా సంఘాల నాయకులు పివైఎల్. ఎస్.రవి, ఎస్ వెంకటేష్, ఐఎఫ్టియు నాయకులు భానుచందర్, గంజి రాజారాం , సొప్పరి గంగాధర్, రాజన్న, పి డి ఎస్ యు పి ఓ డబ్ల్యు. నాయకులు బి ప్రిన్స్, చిట్టెక్క, ధనలక్ష్మి, ఏఐకేఎంఎస్ బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: వర్గ పోరాటం తీయడం చేయడమే మార్క్సిస్టు మహా ఉపాధ్యాయులు కు నిజమైన నివాళి అవుతుందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సిరికొండ సబ్ డివిజన్ లికార్యదర్శి వి.బాలయ్యలి అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా సిరికొండ మండల కేంద్రంలో లెనిన్ స్మారక సభను నిర్వహించారు. బాలయ్య మాట్లాడుతూ, రష్యా దేశ నిర్దిష్ట పరిస్థితికి మార్క్సిజాన్ని అన్వయించి, విప్లవం సాధించడంలో కీలకపాత్ర నిర్వర్తించారని ఆయన తెలిపారు. "ఏమి చేయాలి" అనే గ్రంథాన్ని లెనిన్ రచనను విప్లవ కమ్యూనిస్టు కార్యకర్తలు అందరూ తప్పకుండా అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. ఘర్షణ లేకుండా చరిత్రలో మార్పు లేదని, మానవాళి విముక్తి కోసం సాగే విప్లవ రహదారికి లెనిన్ దిక్సూచి అని ఆయన అన్నారు. లెనిన్ జీవితం కమ్యూనిస్టు విప్లవ కారులకు స్ఫూర్తి అని ఆయన కొనియాడారు. దేశంలో విప్లవ కారులు, దళితులు, ఆదివాసులు, మైనార్టీలు వివక్షతకు అణచివేతకు గురి చేయబడ్డ ప్రజలందరిని ఐక్యం చేసి మతోన్మాదాన్ని ఓడించాలని బాలయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ నాయకులు పిట్ల మార్క్స్, నిమ్మల భూమేష్, వి.పద్మ, మల్కిసంజీవ్ గులాం హుసేన్, కృష్ణ, నరేష్ గౌడ్, శివరాజ్,నర్సగౌడ్.చిన్న గంగాధర్, హెూటల్ సాయికుమార్, గొల్ల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ: మార్క్సిస్టు మహోపాధ్యాయుడు, రష్యా విప్లవ నిర్మాత కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్.ఆర్ భవన్, కోటగల్లీలో కామ్రేడ్ లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. కామ్రేడ్ లెనిన్ నాయకుడు, కార్యకర్త, ఆర్గనైజర్, ఉపాధ్యాయుడు, ఉపన్యాసకుడు, నిర్మాణశిల్పి, సిద్ధాంతవేత్త, వ్యూహకర్త, ఎత్తుగడల రూపకర్త, అన్నింటి కన్నా మహోన్నత మానవుడు అని కొనియాడారు. ప్రస్తుతం మనదేశంలో మతోన్మాదం, సామ్రాజ్యవాదం పెనవేసుకొని దోపిడీ, పీడన కొనసాగిస్తున్నాయన్నారు. మోడీ ప్రభుత్వం ప్రజల్ని మతం మత్తులో ముంచి ప్రభుత్వ సంస్థలను, ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యవస్థ మున్నెన్నడూ లేనంత తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. లెనిన్ ఆచరణలో నిరూపించిన విప్లవాచరణ, విప్లవ నిర్మాణం అవసరమన్నారు. ముఖ్యంగా నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్ట వైఖరిని చేపట్టడం అవసరమన్నారు. సామ్రాజ్యవాదం, మతోన్మాదాలకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యవంతం చేయడమే కామ్రేడ్ లెనిన్‌కి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, సహాయ కార్యదర్శి సిహెచ్ సాయగౌడ్, పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఆల్గోట్ రవీందర్, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు డి.కిషన్, బి.మురళి, టి.విటల్, బి.లింగం, డి.కిరణ్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబా, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: సిపిఐ జిల్లా కార్యాలయంలో అమరులు కామ్రేడ్ లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే మనిషిని మనిషి దోచుకోని సమాజంను రష్యాలో గత రాజరిక వ్యవస్థ జార్ చక్రవర్తిని లెనిన్ నాయకత్వంలో పోరాటంతో ఓడించి సోవియట్ రష్యాలో సమ సమాజాన్ని స్థాపించిన ఘనత లెనిన్‌కే చెల్లుతుందని అన్నారు. లెనిన్ పోరాట స్ఫూర్తితోనే భారతదేశంలో 1920లో ఏఐటియుసి, 1925లో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్రం కావాలని పోరాడి, ఎందరో మహానుభావుల ప్రాణత్యాగ స్ఫూర్తితోనే యువత సంబంధ వర్గాలు భారతదేశ స్వతంత్రం కోసం పోరాటం నిర్వహించాయని అన్నారు. నేడు పాలకులు అధికారమే లక్ష్యంగా పనిచేస్తున్నారని, గెలిచిన తర్వాత ప్రజా సమస్యలు పట్టించుకోవడంలేదని తెలిపారు. లెనిన్ పోరాట స్ఫూర్తితో ప్రజా, కార్మిక, ఇతర సమస్యల కోసం ప్రజలు పోరాటం ర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. సీనియర్ రాజకీయ నేత ఏ ఎస్ పోశెట్టి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.రఘురాం, సాయమ్మ, అంజలి, కే.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: భారతదేశంలో కార్మిక వర్గ రాజ్య స్థాపన కోసం ప్రతి ఒక్క కమ్యూనిస్ట్ కార్యకర్త కృషి చేయాలని సీపీఐ(యం-యల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలో నీలం రామచంద్రయ్య భవన్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల పాపయ్య మాట్లాడుతూ.. రష్యాలో కార్మిక వర్గం రాజ్యాధికారం, విప్లవం విజయవంతం కావడానికి కామ్రేడ్ లెనిన్ కృషి చేశాడని తెలిపారు. పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా తిరుగుబాటు రావాలని, దోపిడీ, పీడన నశించే వరకు శ్రమజీవులకు విప్లవం సాధించాల్సిన అవసరం ఉందని అన్నారు. సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడి అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి రూపం సంతరించుకుని ప్రపంచ ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్న నేటి తరుణంలో లెనిన్ను అధ్యయనం చేయడం, లెనిన్ను ఆకళింపు చేసుకోవడం, లెనిన్ ను ఆవాహన చేసుకోవడం విప్లవ శక్తులకు తక్షణ అవసరం ఉందని అన్నారు. భారతదేశం లో ఫాసిజం పెరిపోయిందని , కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, విద్యార్థి వ్యతిరేక విధానాలను తీసుకువస్తున్నారని, వాటిని వ్యతిరేకించాలని , దేశంలో కార్మిక రాజ్య స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు వేల్పూర్ భూమయ్య, నీలం సాయిబాబా, పరుచూరి శ్రీధర్, దేశెట్టి సాయిరెడ్డి, శివకుమార్,మురళి, సత్యం, రమేష్,జన్నారపు రాజేశ్వర్, రాజు, కృష్ణ ,పోశెట్టి,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో ...

ఆర్మూర్: పట్టణంలోని యానం గుట్ట సుందరయ్య కాలనీలో లెనిన్ శత వర్ధంతిని సిపిఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. లెనిన్ ఫోటోకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ..సోవియట్ విప్లవ సాధకుడు కామ్రేడ్ లెనిన్ మరణించిన రోజున ప్రముఖ కవి మయకోవ్‌స్కీఅన్న మాటలివి. కామ్రేడ్ లెనిన్ 1924 జనవరి 21న మరణించాడని, ప్రపంచవ్యాప్తంగా ఆ రోజున లెనిన్ వర్ధంతి జరుగుతుందని, ఈ సందర్భంగా లెనిన్‌ను స్మరించుకోవడం అంటే అదొక గొప్ప బాధ్యతని, ఎందుకంటే ఆయనకు నివాళి అర్పించడం అంటే ఆయన ప్రాపంచిక దృష్టిని (సిద్ధాంతాన్ని), విప్లవ కార్యాచరణను (ఆచరణని) అర్థం చేసుకోవడం అని తెలిపారు. మారుతున్న ప్రతి పరిస్థితికీ, ప్రతి మలుపుకూ లెనిన్ మార్క్సిజాన్ని అన్వయించాడని, అలాంటి సైద్ధాంతిక ఆలోచనలతోనే తన ఆచరణను సాగించాడని, అందుకే ఆ సిద్ధాంత ఆచరణల మేలు కలయికే మార్క్సిజం - లెనినిజమయ్యిందని తెలిపారు. అందుకే శ్రామికవర్గ విముక్తి కోసం పనిచేసే ప్రతి కమ్యూనిస్టు లెనిన్‌ను అధ్యనం చేయాలని, ఆ అధ్యయనాన్ని తమ కార్యాచరణకు అన్వయం చేసుకోవాలని, సునిశిత పరిశీలన, పరిశోధన లెనిన్ అధ్యయన పద్ధతులు లెనిన్ తన జీవితకాలంలో ప్రతి విషయాన్ని సునిశితంగా పరిశీలించేవాడని, పరిశోధించేవా డని అన్నారు. లెనిన్ తన మొదటి రచన "రష్యన్ రైతాంగ జీవితంలో నూతన ఆర్థిక పరిణామాలు" అనే గ్రంథాన్ని 1893లో రాశాడని తెలిపారు. . 1894లో 'ప్రజామిత్రుల నిజ స్వరూపం" అనే మరో గ్రంథాన్ని రాశాడని, వాటి రచన కోసం ఆయన మొత్తం రష్యన్ గ్రామీణ సమాజాన్ని అధ్యయనం చేశాడని, అందుకు అవసరమైన విస్తారమైన సమాచారాన్ని సేకరించాడని అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో...


భారత విప్లవోద్యమంలో ఉత్తేజకరమైన మలుపు

- ప్రజా పంథా రాష్ట్ర నాయకులు రామకృష్ణ

నవతెలంగాణ-సిరికొండ

భారత దేశంలోని 14 రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న మూడు సిపిఐ ఎంఎల్ పార్టీలు ఒక్కటిగా విలీనం అయ్యాయి. ఈ విలీన పార్టీల్లో తెలంగాణ రాష్ట్రంలోని సిపిఐఎంఎల్ ప్రజాపంథాతోపాటు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఉన్న పిసిసి - సిపిఐ ఎంఎల్, సిపిఐ ఎంఎల్ - ఆర్ఐ ఈ మూడు విప్లవ పార్టీలు విలీనం అయ్యాయని రామకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని గడ్కోల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆల్ ఇండియా విప్లవ పార్టీగా సిపిఐ ఎంఎల్ ఆవిర్భవించడం దేశ కార్మిక ఉద్యమానికి ముఖ్యమైన భూమిక పోషిస్తుందని అన్నారు. మూడు విప్లవ పార్టీలు ఒక్కటైన సందర్భాన్ని పురస్కరించుకుని మార్చి నెల 3,4,5 తేదీలలో ఖమ్మంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ, అనంతరం ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమావేశంలో డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్. రమేష్, పార్టీ నాయకులు బి బాబన్న, ఆర్ దామోదర్, సాయరెడ్డి, ఏం నారా గౌడ్ , బి కిషోర్, అనిస్, యం. లింబాద్రి బాల్ రెడ్డి, బి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా పంథా రాష్ట్ర నాయకులు రామకృష్ణ

ప్రత్యేక ఓటర్ నమోదును పరిశీలించిన తహసిల్దార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్‌లో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను తహసిల్దార్ ఆంజనేయులు ఆదివారం సందర్శించి పరిశీలించారు. బూత్‌ల వివరాలు, ప్రత్యేక ఓటర్ నమోదుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఇప్పటివరకు కొత్త ఓటర్ నమోదు కోసం, మార్పులు చేర్పుల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయని బూత్ లెవల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండినటువంటి ఓటరు ఎవరైనా ఉంటే వారికి వారి ఓటు హక్కు ప్రాధాన్యత గురుంచి అవగాహన కల్పించి, వారితో ఫారం నెంబర్-6 కి దరఖాస్తు చేయించాలన్నారు. కొత్తగా ఓటర్లు నమోదు చేసుకునే వారి కోసం ఫారం నెంబర్-6, ఓటర్ కార్డులో ఏదైనా తప్పులు దొర్లితే దాన్ని సరిదిద్దుకొనుటకు ఫారం నెంబర్-8, ఎవరైనా మరణించిన, శాశ్వతంగా షిఫ్టు అయిన వారి కోసం ఫారం-7ని అప్లై చేయించాలని సూచించారు. ఏ రోజు దరఖాస్తులను ఆ రోజే ఆన్ లైన్ చేయాలని బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు సరిత, శోభ, బాజే సాబ్, పంచాయతీ సిబ్బంది రవి, తదితరులు పాల్గొన్నారు,



దరఖాస్తులను స్వీకరిస్తున్న దృశ్యం

దోమల నివారణకు ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న కార్మికులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసకొత్తూర్ గ్రామంలో దోమల బెడద నుండి ప్రజలను కాపాడేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఫాగింగ్ చేయించారు. గ్రామంలో దోమల బెడద ఎక్కువవడంతో గ్రామస్తుల కోరిక మేరకు సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ స్పందించి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివరణకై గ్రామం తోపాటు మరుతినగర్ కాలనీలో గల్లి గల్లిలో ఆటో ద్వారా ఫాగింగ్ చేయించారు. గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. దోమల నివారణకు చేపట్టిన ఫాగింగ్‌ను ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశోభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వృద్ధుని అరికట్టవచ్చన్నారు. చెత్త చెదారం మురికి కాలువలో వేయవద్దని, గ్రామపంచాయతీ ద్వారా అందించిన చెత్తబుట్టలో నిలువ చేసుకొని, పంచాయితీ చెత్త ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులో వేయాలని కోరారు. కార్యక్రమంలో కరోబార్ రమణ, భారత్, తదితరులు పాల్గొన్నారు.

బాదం ఆకుపై శ్రీరాముని చిత్రం



నవతెలంగాణ-మద్నూర్

నేడు అయోధ్యలో జరిగే శ్రీ బలరామ ప్రాణ ప్రతిష్ట మహెూత్సవం సందర్భంగా మద్నూర్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆర్ట్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించే భాసా బాలకిషన్ బాదం ఆకుపై శ్రీరాముని విగ్ర చిత్రపటాన్ని అద్భుతంగా గీశారు. బదాం ఆకు పైన శ్రీరాముని చిత్రపటం గీసిన ఆ కళాకారునికి ప్రజలు అభినందించారు. ఇలాంటి చిత్రపటాలు ఆ కళాకారుడు అప్పుడప్పుడు ప్రయోగాలు చేయడం అతడు చేసే ప్రయోగాలకు ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు జిల్లాలో ట్రాఫిక్ ఆంక్షలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అయోధ్యలోని రామ మందిరం లో శ్రీరాముని విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా నిజామాబాదు పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్ , బోధన్ డివిజన్ లో ట్రాఫిక్ ఆంక్షలు తూచా తప్పకుండా ప్రజలు పాటించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నేడు (సోమవారం) ఉదయం 6 గంటల నుండి తేది 23-1-2024 నాడు ఉదయం 6 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసు వారికి సహకరించాలన్నారు. పోలీసులు తెలిపిన దాని ప్రకారంగా దేవాలయాల పరిధిలో 1 కిలోమీటర్ పరిధి వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయన్నారు. నిజామాబాద్ డివిజన్‌లోని హైమది బజార్ లోని శంబుని గుడి , వీక్లీ మార్కెట్ లోని గోల్ హనుమాన్ , ఖిల్లా రఘునాథ్ ఆలయం, ఆర్మూర్ డివిజన్లోని కన్యకా పరమేశ్వరి ఆలయం , రాంనగర్ రామాలయం మందిరం, బోధన్ డివిజన్లోని రామాలయం బోధన్ , మారుతి మందిర్ , రాకాసిపేట్ హనుమాన్ దేవాలయం , ఏక చక్రేశ్వర స్వామి దేవాలయం పరిసరాల్లో ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు.

కూలేందుకు సిద్ధంగా బస్టాండ్

- శిథిలావస్థలో నాగిరెడ్డిపేట్ ప్రయాణప్రాంగణం
- 32 ఏండ్ల క్రితం నిర్మాణం
- పదేండ్లుగా పట్టని నాయకులు
- హోటళ్లు, చెట్ల కింద బస్సుల కోసం వేచి ఉంటున్న ప్రయాణికులు



శిథిలావస్థలో ఉన్న బస్టాండ్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. పదేండ్లుగా పెచ్చులూడతున్నా.. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీంతో బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిఉండే అవకాశం లేక.. రోడ్డు మీద హోటళ్లల్లో, చెట్ల కింద ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వస్తుంది. ఎండకాలం సమీపిస్తుండటంతో నిలవనీడ లేకుండా ఎండలోనే నిలబడాల్సి వస్తదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మండల వాసులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో 1992లో నిర్మించిన బస్టాండ్ కేవలం శిథిలావస్థకు చేరింది. 32 ఏండ్లు సేవలందించిన బస్టాండ్ పెచ్చులూడుతూ ఎప్పుడు కూలుతదో తెలియని పరిస్థితిగా మారింది. గత పది సంవత్సరాలుగా బస్టాండ్ లో వసతులు అన్ని కరువైపోయాయి. బోధన్-మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారి కావడంతో మండల కేంద్రం మీదుగా సుమారు 40 నుంచి 50 బస్సుల రాకపోకలు సాగుతుంటాయి. వందలాది మంది ప్రయాణికులు నాగిరెడ్డిపేట్ మండల కేంద్రం నుంచి ఇరువైపులా రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ ఉన్నా.. కూలేందుకు సిద్ధంగా ఉండటంలో నిర్మానుష్యంగా మారింది.

బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బెంచీలు దిమ్మెలు కూలిపోవడంతో ప్రయాణికులకు కూర్చోవడానికి వసతులు లేకుండా అయిపోయాయి. బస్టాండ్‌లో ఎవరు విధులు నిర్వర్తించక పోవడంతో బస్టాండ్‌ను పట్టించుకునే నాధుడే కరువైపోయాడు. గత పది సంవత్సరాలుగా బస్టాండ్‌ను పట్టించుకోకపోవడంతో బస్టాండ్లో పైకప్పు పెచ్చులూడి పడటంతో పాటు గోడలన్ని శిథిలావస్థకు చేరాయి.

రోడ్డు మీదే ప్రయాణికులు పడిగాపులు

బస్టాండ్ శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులంతా బస్టాండ్‌లో వెళ్లకుండా బస్టాండ్ ఆవరణలో హెూటలలో గాని చెట్ల కింద గాని బస్సుల కోసం ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది.. బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల కొరకు ఏర్పాటుచేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రారంభించ డంతో బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. కానీ వసతులు లేకపోవడంతో బస్టాండ్ ప్రాంతంలోకి ప్రయాణికులు ఎవరు పోవడం లేదు. బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్ల సౌకర్యం గాని మంచినీటి సౌకర్యం ఏ ఒక్క వసతి కూడా లేకుండా పోయింది. బస్టాండ్‌ను పట్టించుకునే నాధుడు కరువు కావడంతో బస్టాండ్‌లో చెత్తాచెదారం పెరిగిపోయింది. బస్టాండ్‌లో బస్సుల సమయంలో తెలిపే కంట్రోలర్ లేకపోవడంతో ఏ బస్సు ఎప్పుడు వస్తుందో ఏ బస్సు ఎప్పుడు పోతుందో ఎవరికి అడగాలో తెలియని పరిస్థితిలో ప్రయాణికులు ఉన్నారు. శిథిలావస్థకు చేరిన బస్టాండ్‌లో వసతులు కరువైన ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్‌ను మరమ్మతులు చేపట్టి వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డిపోమేనేజర్ దృష్టికి తీసుకెళ్లా
జెడ్పీటీసీ మనోహర్ రెడ్డి



నాగిరెడ్డి పేట మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరడం వాస్తవమే.. 15 లక్షలతో ఆర్టీసీ బస్టాండ్ చుట్టూరా సిసి రోడ్ ఏర్పాటు చేశాము. బస్టాండ్ శిథిలావస్థకు చేరిందని డీపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రజల అవసరాల రీత్యా త్వరగా మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో నాయకులకు వినతి పత్రాలు కూడా సమర్పించాం.

చెట్ల కింద కూసుంటున్న
ప్రయాణికుడు దావిద్



మాది గోలి లింగాల గ్రామం. మండల కేంద్రం నుంచి అటు బాన్సువాడకు, ఇటు మెదక్‌కు వెళ్లేందుకు నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల బస్టాండ్‌కు వస్తున్నాం. అక్కడ కూర్చోవడానికి ఎలాంటి సదుపాయాలు లేకపోవడంతో బస్టాండ్ శిథిలావస్థకు చేయడంతో బస్టాండ్ ఆవరణలో గల హెూటల్లో వద్ద చెట్ల కింద నిలుచుని బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా ఆర్టీసీ అధికారులు గానీ నాయకులు గానీ స్పందించి శిథిలావస్థకు చేరిన బస్టాండ్‌ను కూల్చి కొత్త బస్టాండ్ నిర్మించాలి.



నగదువెచ్చించి బైక్ కొనుగోలు చేసినా కిస్తీ చెల్లించాలంటూ ఇంటికి..



ప్రైవేట్ ఫైనాన్స్ వారితో మాట్లాడుతున్న దృశ్యం

నవతెలంగాణ-సదాశివనగర్

చదువురాని వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని.. నగదు చెల్లించి బైక్ కొనుగోలు చేసినా.. రుణం ఉందంటూ కిస్తీలు చెల్లించాలంటూ ప్రయివేటు ఫైనాన్స్ వారు ఇంటికి వచ్చారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కామెల్లి మంజుల పేరుతో 2021 అక్టోబర్ నెలలో స్పెండర్‌ప్లస్ బైక్‌ను కొనుగోలు చేశారు. గాంధారి మండల కేంద్రంలోని షోరూంలో పూర్తిగా నగదు చెల్లించి కొనుగోలు చేసినట్టు తెలిపారు.అయితే ప్రయివేటు ఫైనాన్స్ వారు ఆదివారం మంజుల ఇంటికి వచ్చి బైక్‌పై తీసుకున్న ఋణం చెల్లింపు చేయలని డిమాండ్ చేశారు. దీంతో కుటుంబీకులు ఒక్కసారిగా షాక్‌కు గురైయ్యారు. తాము పూర్తిగా నగదు చెల్లించి కొనుగోలు చేసినట్టు తెలిపారు. అయితే ఇప్పటి వరకు 16 కిస్తులు చెల్లించారని మిగత 14 కిస్తులు చెల్లించాల్సి ఉందని సదరు ఫైనాన్స్ సిబ్బంది తెలిపారు. దీంతో చుట్టుపక్కన వారు గ్రామస్తులు అక్కడికి చేరుకొని 16 కిస్తీలు ఎవరు చెల్లించారని నిలదీశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సిబ్బంది తెలిపి వెళ్లిపోయారు.

మైనార్టీ గురుకుల జూనియర్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్



ప్రిన్సిపాల్ కిషన్

లింగంపేట్ మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో 2024-25 సంవత్సరం గాను అడ్మిషన్లు ప్రారంభించినట్టు తెలంగాణ మైనార్టీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆకుల కిషన్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ బైపీసీ గ్రూపుల్లో 80 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. అందుకుగాను ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అడ్మిషన్లు పొందాలన్నారు. దరఖాస్తు చేసుకొని సంబంధిత ప్రిన్సిపాల్ ను కళాశాలను సంప్రదించాలని ఆయన సూచించారు. మైనార్టీ బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బడుగు బలహీన వర్గాలు మైనార్టీలకు చెందినటువంటి విద్యార్థుల కోసం కార్పొరేట్ తరహాలో వసతులు విద్యాబోధన కల్పించినట్టు తెలిపారు. ఫిబ్రవరి 6 వరకు అడ్మిషన్లు తీసుకోనున్నట్టుతెలిపారు. పూర్తి వివరాల కోసం సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ ను సంప్రదించాలని ఆయన సూచించారు.

నెలాఖరులోగా సీఎంఆర్ చెల్లించాలి

- రైస్‌మిల్లర్‌లను ఆదేశించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-మాచారెడ్డి



రైస్‌మిల్లును పరిశీలిస్తున అదనపు కలెక్టర్

గత ఖరీఫ్ 2022-23 కు సంబంధించి పెండింగ్ ఉన్న సిఎంఆర్ రైస్‌ను ఈ నెలాఖరులోగా కేటాయించాలని అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ రైస్ మిల్ యజమానిని ఆదేశించారు. ఆదివారం పాల్వంచ మండల కేంద్రంలోని రేణుక మాడ్రన్ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 24 గంటలు రైస్ మిల్లును నడిపి లక్ష్యాన్ని అధిగమించాలని, లేనిచో తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ఈ నెల 31 వరకు పెండింగ్ ధాన్యం ఎఫ్.సి.కి. అప్పగించుటకు గడువు విధించిందినందున అప్పటి లోగా బియ్యం పెట్టని మిల్లుల యజమానులపై ఆర్ ఆర్ యాక్ట్ కింద చర్యలు తీసుకోవడమే కాకుండా, క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్ అయి ఏడాది గడిచినా ఇంతవరకు ధాన్యం అప్పగించక పోవడం పట్ల ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నదని, ఇప్పటికైనా మిల్లర్లు అలసత్వం వీడి లక్ష్యాన్ని అధిగమించాలని ఆదేశించారు. లేని యెడల ఆర్ఆర్ యాక్ట్ కింద 125 శాతం రికవరీ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు ఉప తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెస్టివల్‌లో మెరిసిన జిల్లా ఉపాధ్యాయుడు

నవతెలంగాణ-కామారెడ్డి

భారతదేశ డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్, డిపార్ట్మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో హర్యానా లోని ఫరీదాబాద్ లో జనవరి 17 నుంచి 20 తేదీ వరకు నిర్వహించిన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో కామారెడ్డి జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు విజయగిరి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ అంతర్జాతీయ కార్యక్రమానికి ఆర్గనైజింగ్ కమిటీ దేశవ్యాప్తంగా నిష్ణాతులై, విషయ పరిజ్ఞానం గల ఉపాధ్యాయులను వివిధ దశలలో పరీక్షించి ఆహ్వానం పంపింది .అందులో కామారెడ్డి జిల్లా చిన్న మల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విజయగిరి రామకృష్ణ ను ఎడ్యుకేషన్ ఫర్ ఆస్పైరింగ్ ఇండియా - నేషనల్ సైన్స్ టీచర్స్ వర్క్ షాప్ విభాగమందు ఎంపికై భాగస్వాములయ్యారు.

ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఈ విభాగంలోదేశవ్యాప్తంగా వినూత్నమైన, అంకిత భావంతో కూడిన ఉపాధ్యాయులను, విద్యావేత్తలను సేకరించడం దీని లక్ష్యం. ఇందులో పాల్గొనేవారు కార్యాచరణ ఆధారిత అభ్యసన బోధనా పద్ధతులు వివిధ ఆవిష్కరణలను పంచుకుంటారు. ఈ సదస్సులో ప్రముఖ శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు, వివిధ విభాగాల అనుసంధా నకర్తలు భాగస్వాములు అవు తారు. ప్రయోగాత్మక అభ్యసనాన్ని ప్రోత్సహించడానికి ఈ ఫెస్టివల్ ఉపయోగపడుతుంది.



పురస్కారాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయుడు

ఈ కార్యక్రమం పై రామకృష్ణ మాట్లాడుతూ.. ఈ విభాగంలో ప్రపంచంలోని 33 దేశాలకు చెందిన విద్యావేత్తలు పాల్గొన్నారని, మలేషియా, సింగపూర్ ,కెన్యా ,సిరియా వంటి దేశాల విద్యావేత్తలు తమ తమ దేశ విద్యా బోధనా పద్ధతుల గురించి వివరించారని తెలిపారు. మన దేశంలో కొనసాగుతున్న నూతన జాతీయ విద్యా విధానం - 2020 గురించి విద్యార్థుల్లో కృత్యాధార బోధన వ్యూహాల ద్వారా చర్చ జరిగిందన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు,ఐఐటి ఖరగ్పూర్ కు చెందిన ప్రొఫెసర్లు తమలో నూతన ఉత్తేజాన్ని నింపారని, గణితము, సైన్స్ పైన జరిగిన ఆవిష్కరణలపై సదస్సులో ప్రయోగాత్మకంగా సమాచారాన్ని పంచుకోవడం నిజంగా సంతోషాన్నిచ్చిందని తెలిపారు.

రామకృష్ణ జనవరి - 2023లో కేరళలోని త్రిశూర్‌లో జరిగిన దక్షిణ భారతదేశ సైన్స్ ఫెయిర్ లో తెలంగాణ నుండి పాల్గొని ఇస్రో వారిచే ప్రతిష్టాత్మక పురస్కారాన్ని పొందారని అలాగే జాతీయ నూతన విద్యా విధాన సదస్సు తన పరిశోధన ద్వారా ప్రాజెక్టు డాక్యుమెంటేషన్ ప్రదర్శించి అందరి మన్ననలు పొంది విశిష్ట గణిత ఉపాధ్యాయ పురస్కారాన్ని, అబ్దుల్ కలాం పురస్కారాన్ని పొందారని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి , ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న జిల్లా సైన్స్ అధికారి సిద్ధరామిరెడ్డి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు.

ఓటర్ నమోదు పరిశీలన

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలంలోని బంజపల్లి, సుల్తాన్ నగర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల యందు ఆదివారం అడిషనల్ కలెక్టర్ మను చౌదరి ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాలను పరిశీలించారు. బంజపల్లి గ్రామపంచాయతీలో ఓటర్ నమోదు కేంద్రం పరిశీలించి ఓటర్ జాబితాలో కొత్తగా ఓటు హక్కు నమోదు మార్పులు చేర్పులు చిరునామా మార్పులు ఫామ్ 6,8,7 లకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. చనిపోయిన వారి పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బిక్షపతి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

అంతర్జాతీయ మల్టీపుల్ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు కృషి

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావ్



విజేతలకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-పిట్లం

అంతర్జాతీయ మల్టిపుల్ క్రీడా ప్రాంగణము ఏర్పాటుకు కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుడి ఎదురుగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏనుగండ్ల శ్రీనివాసరెడ్డి స్పాన్సర్ చేసిన క్రికెట్ పోటీలు వారం రోజులపాటు నిర్వహించిన నిర్వహించిన గెలు పొందిన విజేతల బహుమతుల ప్రధానోత్సవములో సభలో పాల్గొని మాట్లాడారు. దేశము గర్వించదగ్గ క్రీడాకారులను ఈ ప్రాంతానికి రావడానికి కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఒలంపిక్ క్రీడాకారుడ, ద్రోణాచార్య అవార్డు గ్రహీత షేక్ సమ్మన్ తో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. మల్టీ ఫుల్ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసినట్లయితే ఒకే ప్రాంతంలో అన్ని క్రీడలను నిర్వహించుకొనుటకు అవకాశం కలుగుతుందన్నారు. నియోజకవర్గంలోని క్రీడాకారుల అభ్యున్నతికి ఏదో ఒక మండలంలో అంతర్జాతీయ మల్టీ ఫుల్ క్రీడా ప్రాంగణము ఏర్పాటుకు తప్పకుండా కృషి చేస్తానని క్రీడాకారులకు హామీ ఇచ్చారు. గెలుపోటములు సహజమని ఓడినవారు కృంగిపోవద్దని సూచించారు. రానున్న రోజులు తమవే అన్నట్లు భావించాలని సూచించారు.

వారం రోజులపాటు నిర్వహించిన క్రికెట్ పోటీలలో నియోజకవర్గం నుచి 44 టీమ్‌లు పాల్గొనడా, ఫైనల్‌లో పిట్లం వర్సెస్ బిచ్కుంద తలపడగా.. బిచ్కుంద నిర్ణీత 10 ఓవర్‌లలో 67 పరుగులు చేశారు. పిట్లం జట్టు 9 ఓవర్‌లలో 44 పరుగులు చేసి ఆల్ అవుట్ కావడంతో బిచ్కుంద విజేతగా నిలవడంతో 11,111 రూపాయల ప్రైజ్‌మనీని, మెమెంటోను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు జంబిగే హన్మాండ్లు , అడ్వకేట్ రామ్ రెడ్డి , మోహన్ రెడ్డి , చింతల సాయి రెడ్డి, మరగల దయానంద్ , బొడ్ల రాజు , చిప్ప శివ , సూరత్ రెడ్డి , అనుమా గంగారాం , యువ నాయకులు ప్రవీణ్ , హిం రోజ్ , రాజు , క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

కురుమ చైతన్య సమితి నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కురుమ సంఘం సభ్యులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల పరిధిలోని ఐలాపూర్ గ్రామంలో ఆదివారం కురుమ యువ చైతన్య సమితి కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను స్థానిక సర్పంచ్ ధనలక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ సాయిలు చేతుల మీదుగా సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి సంజీవ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మామిడి సంజీవులు మాట్లాడుతూ కురుమలు ఆర్థికంగా రాజకీయంగా విద్య పరంగా ముందుకు పోవాలన్నారు. అన్ని రంగాల్లో ముందుండాలని ముఖ్యంగా చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. హక్కుల సాధన కోసం కలిసి పోరాడాలి అన్నారు. కార్యక్రమంలో కులపెద్ద మొకిరె సాయన్న, దాకాల మల్లయ్య సూర్న మల్లయ్య సూర్న శంకర్, మామిడి సంగయ్య లింగంపేట్ మండల అధ్యక్షులు మండల అద్యక్షులు దాకాల అశోక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొకిరె సంజీవ్, చెట్కురి నవీన్, మొకిరె స్వామి, నాగం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా కుంట లింగారెడ్డి, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు సాయిరెడ్డి, ఉపాధ్యక్షులు సురేందర్ రెడ్డి, గంగారెడ్డి, కోషాధికారి దుర్గరెడ్డి, గణేష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సురేందర్ రెడ్డి,బాపురెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సదస్సుకు తరలిన జనసమితి నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి



సదస్సుకు బయలుదేరిన నాయకులు

రాష్ట్ర విభజన హామీలు అమలు కేంద్ర ప్రభుత్వం వివక్ష అనే అంశంపై సోమ వారం హైదరాబా దులో తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సదస్సు నిర్వహించారు. అందులో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రం నుండి తెలంగాణ జన సమితి నాయకులు ఈ సదస్సుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు గడుస్తున్నా. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటివరకు కూడా అమలు కాకపోవడం తెలంగాణకు భారీ నష్టం చేపిస్తుంది. కష్ణ జలాలలో న్యాయమైన వాటా తేల్చాలి ఉద్యోగులు విభజన పూర్తిచేసి తెలంగాణ ఉద్యోగులను వెనక్కి పంపాలి. తదితర అంశాలను ఈ సదస్సులో తీర్మానం చేసినట్టు నాయకులు తెలిపారు. ఈ సదస్సుకు కామారెడ్డి జిల్లా తరపున తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు కుంభాల లక్ష్మణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రజినీకాంత్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చాకలి కుమార్, ఉపాధ్యక్షుడు మధు ఫూల్ సింగ్, మహిళా విభాగం రాణి, చుక్కల ఇంచార్జ్ చందు, రాజు, యువజన నాయకులు నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదానం

నవతెలంగాణ-రెంజల్



మండలం లోని కళ్యాపూర్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం యువత రక్తదానం చేశారు. స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని యువజన ఉత్సవాల పురస్కరించుకుని రక్తదానం ఏర్పాటు చేసినట్టు ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షులు నల్ల నవీన్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఏదో ఒక రూపంలో తమ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సేవా కార్యక్రమంలో పాల్గొంటామని చెప్పారు. గ్రామంలో సుమారు 30 మంది యువత రక్తదానం చేశారన్నారు. సేకరించిన రక్తాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కాశం సాయిలు, గంగోని వినోద్, మైని సంతోష్, కాలేవా ర్ సంతోష్, శివకుమార్, అచ్యుత్, గంగా ప్రసాద్, గాండ్ల మధు, మల్లారి సురేష్, వేణు, సాకలి సాయినాథ్, ఎం .నందు, తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదానం

నవతెలంగాణ ఎడపల్లి

అయోధ్యలోని శ్రీ బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలో గల రామాలయం వద్ద గ్రామస్తులు మహిళలు ప్రత్యేక పూజలు సోమవారం నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యమేరకు గ్రామ పెద్దలతో పాటు యువత అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని మంగళ్ పహాడ్, శ్రీ దుర్గామాత ఆలయం వద్ద కమిటీ సభ్యులు అమ్మవారికి అభిషేకం , పూజలు, చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ తోపాటు గ్రామ ప్రజాప్రతినిధులు, యువకులు తెలిపారు. ఏఆర్పి క్యాంపు గ్రామంలోని శ్రీ సీతారామాలయంలో ప్రత్యేకపూజలు అన్నదానం చేస్తున్నట్టు నిర్వాహకులు తోట రాజశేఖర్, కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.. జైతాపూర్, పోచారం గ్రామాల్లో రామాలయంలో కమిటీ పెద్దలు, యువకులు మహిళలు కుంకుమార్చన ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలను, అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు

వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

- ఏఎమ్‌విఐ శ్రీనివాస్



నవతెలంగాణ-బోధన్

ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని సాలూర చెక్ పోస్ట్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని ఆయన వాహనదారులకు భద్రత పరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే కారు ఇతర భారీ వాహనాలు నడిపించేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించి డ్రైవింగ్ చేయాలని అన్నారు. అలాగే సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. ప్రభుత్వం రోడ్డు భద్రత నిబంధనల ప్రకారం ప్రతి వాహనదారుడు నడుచుకోవాలని సూచించారు. లేకుంటే జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉందని హెచ్చరించారు .కార్యక్రమంలో కానిస్టేబుల్ హరికృష్ణ, సిబ్బంది ఉన్నారు.

రామాలయానికి రూ.11వేల విరాళం

నవతెలంగాణ-వర్ని (చందూర్)

మండల కేంద్రంలోని రామాలయం శుద్ధి కార్యక్రమానికి జహీరాబాద్ పార్లమెంట్ నాయకులు శ్రీనివాస్ గార్గే 11 రూపాయలు విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. నేటి నుంచి జరగబోయే అయోధ్య రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం, రామాలయానికి వివిధ కార్యక్రమాలకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సుదీష్ పటేల్, మండల ప్రధాన కార్యదర్శులు సంఘని మహేష్, వీరసరపు శ్రీనివాస్, బిజెపి అధ్యక్షుడు సాహిత్ రెడ్డి, జిల్లా ఐటీసీఎల్ కో కన్వీనర్ సుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి మైనారిటీ వ్యక్తి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-బోధన్



ఆర్థికసాయం అందజేస్తున్న పాషా

అయోధ్యలో బాలరాములని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా సాలూర మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద సోమవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి మైనారిటీ ఆర్థికసాయం అందజేశారు. సాలూర గ్రామానికి చెందిన మైనారిటీ వ్యక్తి పాషా తనవంతుగా రామ భక్తులకు రూ. 5వేల ఆర్థిక సహాయం అందించారు.

ఆలయ నిర్మాణానికి రూ.25,116 విరాళం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



విరాళం అందజేస్తున్న బొజ్జ సంజీవ్‌గౌడ్

మండలంలోని తొర్లికొండ గ్రామంలోగల శిలా తీర్థ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి తన వంతుగా తొర్లికొండ గ్రామానికి చెందిన బొజ్జ సంజీవ్ గౌడ్ రూ.25,116 విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జెడి అన్వేష్ రెడ్డి,లింగారెడ్డి యోగానంద గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- పలుగ్రామాల్లో పర్యటన

నవతెలంగాణ- నవీపేట్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలలో అందరి సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని మాజీ మంత్రి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మండలంలోని నాళేశ్వర్, తుంగిని, నిజాంపూర్, బినోల, సిరన్ పల్లి, జన్నేపల్లి, నారాయణపూర్ గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో మరుగుదొడ్లు, భవనాల నిర్మాణాలతో పాటు ఉపాధ్యాయుల సహకారంతో ప్రైవేటుకు ధీటుగా విద్యాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. పేద తల్లిదండ్రులు పిల్లల చదువులకు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నారని ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తే ఖచ్చితంగా తల్లిదండ్రులు ప్రభుత్వ బడులకు పంపిస్తారని అన్నారు. దానికి అనుగుణంగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. నూతనంగా నిర్మించిన బినోల సొసైటీ భవనాన్ని చైర్మన్ మగ్గరి హన్మాన్లుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రైతులకు నష్టం వచ్చే పనులు చేస్తే సహించేది లేదని రైతుల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని రైతులకు సాగునీటి ఇబ్బంది లేకుండా ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. గత ప్రభుత్వం మోడల్ పాఠశాలలు, పాలిటెక్నిక్ పాఠశాలలను ఏ ఉద్దేశంతో ప్రారంభించిందో ఆ లక్ష్యాన్ని చేరేలా అధ్యాపకులు కృషి చేయాలని అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ఎంపీడీవో, ఎమ్మార్వోల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ప్రజలను సూచించారు. గత ప్రభుత్వ నాయకులు రెవెన్యూ అధికారుల సహకారంతో అవినీతికి పాల్పడ్డారని ఇప్పుడు అలా జరిగితే కఠినంగా వ్యవహరిస్తానని అన్నారు. బినోల సొసైటీ నుండి గతంలో చేర్చిన మోకన్‌పల్లి సొసైటీని వేరే సొసైటీగా మార్చాలని బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హనుమాండ్లు కోరారు. విండో సమస్యలను చైర్మన్లు ఆయన దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను నియంత్రించాలని అలాగే గంజాయి, డ్రగ్స్ లను ప్రోత్సహించే కార్యక్రమాలు జరిగితే కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అన్నారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డిని ఆయా గ్రామాల నాయకులు ప్రజలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీతాంబర్, సరీన్, రొడ్డ సుధాకర్, రవీందర్ రావు, సొసైటీ వైస్ చైర్మన్ బాబర్, ఉప సర్పంచ్ పుట్టి పోశెట్టి, బాల్ రాజ్ గౌడ్, విజయ్, గంగాధర్, కార్యదర్శి రమేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవ తెలంగాణ దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ను మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రభుత్వానికి మధ్య వారధులుగా ప్రజల పక్షాన ఉండాలని అన్నారు. అవినీతి, అక్రమాలను ప్రశ్నించే గొంతుకగా మారాలని అన్నారు. కార్యక్రమంలో బినోల సర్పంచ్ పీతాంబర్, సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు, వైస్ చైర్మన్ బాబర్, ఉప సర్పంచ్ పుట్టి పోశెట్టి, డైరెక్టర్ విజయ్ తదితరులు ఉన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల నష్టపరిహారం చెల్లించాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్‌శోభన్
- చైతన్యసేద్యం డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్



డైరీని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా నాయకులు

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన వ్యవసాయ మాసపత్రిక చైతన్యసేద్యం 2024 డైరీని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ ఆదివారం ఆవిష్కరించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాందేవ్ వాడలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ..చైతన్యసేద్యం మాస పత్రికలో వచ్చే అంశాలు రైతాంగానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. 9 సంవత్సరాల నుండి చైతన్యసేద్యం డైరీలు రైతాంగానికి అందుబాటులో తెస్తున్నామని అన్నారు. ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాల ధరలు పెరిగాయని, పెట్టుబడి ఖర్చుకూడ రాకపోవడంతో రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వాల నుండి సహాయం అందని స్థితిలోనే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై అనేక వ్యాసాలను రైతాంగం ముందుకు తెస్తున్నామన్నారు. వ్యవసాయంలో ఎదురైయ్యే చీడపీడల గురించి వ్యవసాయంలోని మెళకువలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని కార్పోరేట్లకు దోచి పెడుతుందని అన్నారు. రైతాంగ పోరాటం వల్ల ప్రభుత్వం దిగివచ్చిన ఢిల్లీ ఉద్యమంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. రైతులపై పెట్టిన కేసులు కూడా ఎత్తివేయలేదని అన్నారు. చనిపోయిన 750 మంది రైతు కుటుంబాలకు పరిహారం అందజేయాలని కోరారు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని గుర్తు చేశారు. ఆత్మహత్యల నివారణకు స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేయాలని అన్నారు. రుణాల రద్దు కోసం పార్లమెంట్‌లో చట్టం తేవాలని కోరారు. బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. రైతులకు ఆదాయం కోసం ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశు అధ్యక్షులు ఎం గంగాధరప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ద వెంకట రాములు, పి భూమన్న, సాయిలు, దేవేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్సులు చేస్తున్న విద్యార్థినులు

విజయసాయి హై స్కూల్లో హాస్టల్ పేరెంట్స్ డే

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని విజయసాయి హైస్కూల్లో ఆదివారం హాస్టల్ పేరెంట్స్ డే కార్యక్రమాన్ని విజయసాయి యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థి గంగా ప్రసాద్ మాట్లాడుతూ.. తాను విజయసాయి హైస్కూల్లో విద్యను అభ్యసించానని, ఈ పాఠశాల క్రమశిక్షణకు మారుపేరని అన్నారు. ఈ పాఠశాలలో గురువులు బోధించిన విద్యతో అమెరికా, ఇండియాలో పలు కంపెనీలు స్థాపించి ఎంతో మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగినట్లు వివరించారు. అనంతరం మోటివేషన్ స్పీకర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలో టీవీ, సెల్ ఫోన్, సినిమాలు, చెడు స్నేహాలు చేయడం లాంటి అలవాట్లను వదిలేయాలని, దాంతో ఆ విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. మన జీవితంలో తల్లిదండ్రులను మించిన దైవం లేదని, వారిని మర్చిపోరాదని అన్నారు. అలాగే గురువు అందించిన జ్ఞానం జీవితంలో ఉన్నత స్థాయికి చేరేలా నిలబెడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు కృష్ణమోహన్, ఐ ఆర్ చక్రవర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబోయ్ దోమలు..

- గ్రామాల్లో విజృంభిస్తున్న దోమలు
- అస్తవ్యస్తంగా పారిశుధ్యం

నవతెలంగాణ-బోధన్



ఏ గ్రామంలో చూసిన సాయంకాలమైతే చాలు జనం బయట ఉండలేక పోతున్నారు. నిలబడిన, కూర్చున్న దోమల సవ్వడితో జనం వేగలేకపోతున్నారు. దోమలు విపరీతంగా పెరగడం వల్ల దోమకాటుతో జనం అనారోగ్యం పాలవుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి దోమలు వృద్ధి చెందడంతో జనం బాబోయ్ దోమలు అంటు భయపడిపోతున్నారు.గ్రామాలలో ఏ మురికి కాలువలు చూసిన చెత్త చెదారం నిండి దుర్గంధం వ్యాపిస్తున్నాయి. దాంతో మురికి కాలువల్లో చెత్త నిండిన పెంట కుప్పల్లో దోమలు వృద్ధిచెంది బయట నిలబడలేకుండా చేస్తున్నాయి. దోమకాటుతో జనం అనారోగ్యం బారినపడి విష జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. విష జ్వరాలతో ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. అంతేకాకుండా రహదారుల వెంట పంట పొలాల్లో నుంచి కూడా దోమలు విజృంభించడంతో ద్విచక్ర వాహనదారులు సైతం దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల బాధ భరించలేక జనం వేపాకు పొగతో ఉపశమనం పొందుతున్నారు. దోమల వల్ల ఇన్ని ఇబ్బందులు ఎదురవుతున్న పంచాయతీ పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

అటకెక్కిన ఫాగింగ్ మిషన్లు

గ్రామాలలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నియంత్రణకు చేపట్టవలసి ఉన్న కనీసం పట్టించుకోవడం లేదు. దోమల నియంత్రణ కోసం వేల రూపాయలు వెచ్చించి తీసుకువచ్చిన ఫాగింగ్ యంత్రాలు మూలనపడేశారు. ప్రస్తుతం దోమలు విపరీతంగా పెరిగి ఇబ్బందులు పడుతుండడంతో జనం తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక మదనపడుతున్నారు. అయినా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ లు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికైన స్పందించి గ్రామాల్లో దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని జనం కోరుతున్నారు.

మొటాటి రెడ్డి సంఘం ఇందూరు కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

మోటాడి రెడ్డి సంఘం ఇందూరు నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా దావ ముత్యంరెడ్డి, అధ్యక్షులుగా గోవింద గారి గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ద్యావర నర్సారెడ్డి, కోశాధికారిగా లక్కం మనోజ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా పోతునూరి మహిపాల్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా అమరం శ్రీనివాస్ రెడ్డి, యెన్నం లచ్చరెడ్డి, ముఖ్య సలహాదారులుగా జి భూమారెడ్డి, టి రామ్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మన్మోహన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సాయి రెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి,దేవేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

జర్నలిస్టులకు క్రీడలు ఎంతో అవసరం

- అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్యనారాయణ గుప్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జర్నలిస్టులకు క్రీడలు ఎంతో అవసరం అనే నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఈ మేరకు ఆదివారం నిజామాబాద్ పోలీస్ పరేడ్ మైదానంలో గంగా టీం వర్సెస్ హరిద్ర టీం మధ్యలో ఫైనల్ మ్యాచ్ జరగగా ప్రారంభ కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంచి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిత్యం మానసిక ఒత్తిడికి గురయ్యే జర్నలిస్టులకు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో ఆయన కాసేపు క్రికెట్ ఆడారు. ప్రతి ఏటా రెండు సార్లు స్పోర్ట్స్ మీట్స్ నిర్వహించడం అభినంద నీయమని అన్నారు. మానసికంగా ఒత్తిడి ని అధిగమించేందుకు శారీరక శ్రమ దృఢత్వం అవసరమని సూచించారు. క్రీడలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని చెప్పారు. జర్నలిస్టులు క్రీడా స్ఫూర్తిని ఛాటాలన్నారు. మొదటి రోజు మూడు లీగ్ మ్యాచ్ లు జరుగగా రెండు జట్లు ఫైనల్‌కు అర్హత సాధించాయి. గంగా టీం వర్సెస్ హరిద్ర టీం పోటీ పడగా మొదట హరిద్ర టిమ్ టాస్ గెలిచి బ్యాటింగ్ పెంచుకుంది. నిర్ణీత 12 ఓవర్లలో 98 పరుగులు చేసింది. గంగా టింకు లక్ష్య చేదనగా 99 పరుగులు ఇచ్చారు. అనంతరం బ్యాటింగ్లో గంగా టీం నిర్ణీత 12వఓవర్లలో 98 పరుగులు చేసి డ్రాగ మ్యాచ్ కొనసాగింది. అనంతరం ఎంపైర్లు క్రికెట్ టీం ఇన్చార్జిలు కలిసి సూపర్ ఓవర్గా చేస్తూ మ్యాచును ప్రారంభించారు. మొదట గంగా టీం బ్యాటింగ్ చేయగా సూపర్ ఓవర్లో ఆరు బాల్‌లలో 10 రౌండ్లు చేసి పదకొండురౌండ్‌లను టార్గెట్ ఇచ్చారు. నిర్ణీత సూపర్ ఓవర్లో హరిద్ర టీం నాలుగు బాళ్లలో లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, శేఖర్ లతో పాటు క్రికెట్ పోటీల నిర్వాహకులు గోవిందరాజు, మైపాల్, సీనియర్ జర్నలిస్టులు జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు..

సంఘ పటిష్టతకు సమిష్టిగా కృషిచేయాలి

- రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఏనుగుల సత్యనారాయణ పటేల్

నవతెలంగాణ-నిజామాబాద్



రాష్ట్రంలో అత్యధిక సంఖ్య ఉన్నది మున్నూరు కాపు కులంలోనేనని, సంఘ పటిష్టతకు కృషిచేయాలని రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఏనుగుల సత్యనారాయణ పటేల్ అన్నారు. మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల, సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం, రాష్ట్ర కార్యవర్గ సమావేశం, నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక పట్టణ మున్నూరు కాపు కళ్యాణమండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఏనుగుల సత్యనారాయణ పటేల్, ధర్మపురి సురేందర్, రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ బాల శ్రీనివాస్ పటేల్ విచ్చేసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా 300 మంది సభ్యులు సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు, రాష్ట్ర కార్యవర్గానికి వివిధ జిల్లాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఏనుగుల సత్యనారాయణ మాట్లాడుతూ.. సంఘం పటిష్టతకు అందరు సమిష్టగా కృషి చేయాలని రాష్ట్రంలో అత్యధిక సంఖ్య ఉన్న కులం మనది. సభ్యులందరినీ సంఘటిత పరుచుకొని సంక్షేమ కార్యక్రమాలు ప్రగతి బాట నడిపించేందుకు అందరూ కృషి చేయాలని ముందుకు రావాలన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ధర్మపురి సురేందర్ పటేల్ మాట్లాడుతూ.. అత్యధిక మున్నూరు కాపు కళ్యాణ మండపాలు నిజామాబాద్ లోనే ఉండటం గర్వించదగ్గ విషయం అన్నారు. అందరం కలిసికట్టుగా ఉండాలని అన్నారు. గౌరవ అతిథి బాల శ్రీనివాస్ పటేల్ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ఉద్యోగుల సంఘానికి పునాది ఏర్పడ్డప్పటికీ ఆదిలోనే హంసపాద్ అన్నట్టు నిలిచిపోయిందని, మూడు సంవత్సరాల క్రితం మళ్లీ ఒక తాటి మీదికి తీసుకువచ్చి పెద్దలందరిని కలుపుకొని ఇప్పుడు ప్రస్తుతం 33 జిల్లాల్లో ప్రతిష్టాత్మకంగా నిలిచిన ఐక్యత సంఘం తెలంగాణ మున్నూరు కాపు ఉద్యోగులు, విశ్రాంత సంక్షేమ సంఘం అని అన్నారు. సంఘానికి సభ్యత్వం దాదాపు 55000 మంది ఉన్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో సభ్యత్వ నమోదు కొనసాగించి రాష్ట్రంలోని అతిపెద్ద సంఘంగా నిలుపుతామన్నారు. జిల్లా అధ్యక్షుడు తోటరాజశేఖర్ మాట్లాడుతూ అనతి కాలంలోనే ఈ సంఘాన్ని ఒక తాటిపైకి తీసుకువచ్చి జిల్లాలో సభ్యులను ఒకే మాట పైన నడిపిస్తూ సారథ్యం వహించడం జరిగిందన్నారు. సంక్షేమ కార్యక్రమాల్లో బీద విద్యార్థులకు చేయూతనిచ్చి, పెళ్లి పందిరిని ప్రారంభించి అందరికీ ఫలాలు అందే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి అబ్బపూర్ మాట్లాడుతూ జిల్లా నివేదికను సమర్పించారు. అందరూ సభ్యత్వం తీసుకొని సంఘాన్ని ప్రతిష్టపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసం శ్రీనివాస్ పటేల్ సంయుక్త కార్యదర్శి ఆర్మూర్ శ్రావణ్ కుమార్ పటేల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బీ .అంజనేయులు పటేల్ ముఖ్య సలహాదారుడు ఆకుల ప్రసాద్ పటేల్ సహ అధ్యక్షులు జిలకర కిషన్ పటేల్ పెద్దల నాగరాజు పటేల్, సలహాదారులు నేటి కుంట శేఖర్ పటేల్ ,చిట్టి నారాయణ రెడ్డి పటేల్ ,అబ్బాయి లింబాద్రి పట్, ఉపాధ్యక్షులు హరిచరణ్ పటేల్ ,రేంజర్ల నరేష్ పటేల్ ,నిర్వాణ కార్యదర్శి వాసు పటేల్, సంయుక్త కార్యదర్శి శిర్ప రాజు పటేల్, అర్జున్ శేఖర్ పటేల్ కార్యదర్శులు ఆకుల పుష్పకుమారి పటేల్, స్వర్ణలత పటేల్, స్వప్న పటేల్, రచన పటేల్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో సిర్పిలింగం పటేల్ ఆలపించి గానం అందరినీ అలరించింది.